

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com



## నిజామాబాద్

## కామారెడ్డి

ఆదివారం 31 ఆగస్టు 2025 6 పేజీలు


### పోచారం ప్రాజెక్టుకు శాశ్వత మరమ్మత్తుల కోసం

# ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం

### - జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

**సూర్య, నాగిరెడ్డి పేట్**

పోచారం ప్రాజెక్టుకు శాశ్వత మరమ్మత్తు పనుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించి శాశ్వత మరమ్మత్తులు చేపడతామని జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ తెలిపారు. ఆయన శనివారం పోచారం ప్రాజెక్టు వద్ద జరుగుతున్న మరమ్మత్తు పనులను పరిశీలించారు. ప్రాజెక్టు లోకి వస్తున్న ఇన్ ఫ్లో ను, పరిసరాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో గత (మిగతా 2లో)







# ఎస్సారెస్పీని సందర్శించిన కలెక్టర్

### - వరద ఉద్ధృతిపై ప్రాజెక్టు అధికారులతో సమీక్ష

### - దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశం

**సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి**

నిజామాబాద్ జిల్లా మెండోరా మండలం పోచంపాడ్ లో గల శ్రీరాంసాగర్ రిజర్వాయర్‌ను శనివారం జిల్లా కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి సందర్శించారు. ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షాలకు పెద్ద ఎత్తున ప్రాజెకులోకి వచ్చి చేరుతున్న వరద ప్రవాహాన్ని పరిశీలించారు. రిజర్వాయర్లో నీటిమట్టాన్ని పరిశీలించి ప్రాజెక్టు కు చెందిన అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎగువన గల గైక్వాడ్, విష్ణుపురి ప్రాజెక్టులు, బాలేగాం, బాబ్లీ బ్యారేజీలతో పాటు నిజాంసాగర్, గడ్డెన్నవాగు, కౌలాస్ నాల, లెండి ప్రాజెక్టుల మిగులు జలాలు గోదావరి, మంజీర ద్వారా వచ్చి చేరుతుండటంతో ఎస్సారెస్పీకి వరద ప్రవాహం పోటెత్తుతోందని అన్నారు. ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ఏరియాలతో పాటు దిగువన గల లోతట్టు గ్రామాల పరిస్థితి గురించి కలెక్టర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎస్సారెస్పీ పూర్తి స్థాయి నీటి మట్టం 1091.00 అడుగులు, 80.5 టీఎంసిలకు గాను, ప్రస్తుతం 1084.5 అడుగులు, 58.357 టీఎంసిల వద్ద నీరు నిలువ ఉందని తెలిపారు. పరీవాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండడంతో ఎగువ (మిగతా 2లో)



### పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో

# ఆనందంగా ఆరోగ్యంగా గడపాలి

### - కుటుంబ సభ్యుల సమక్షంలో నిర్వహించిన పదవీ విరమణ కార్యక్రమం

### - జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**

సుదీర్ఘకాలంగా పోలీసు వ్యవస్థకు సేవలందించి పదవీ విరమణ పొందుతున్న ఎండి. యూసుఫ్, ఏఎస్సై (బిచ్కుంద పోలీస్ స్టేషన్) కె. చంద్రశేఖర్, ఏఆర్ఎస్ఐ ని కుటుంబ సమేతంగా జిల్లా పోలీసు కార్యాలయానికి ఆహ్వానించి, జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో పదవీ విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మొదటగా కుటుంబ సభ్యుల సమక్షంలో రిటైర్ అవుతున్న అధికారుల దంపతులకు జిల్లా ఎస్పీ పూలమాలలు, శాలువాతో సత్కరించి బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ (మిగతా 2లో)

### కూలిన ఇళ్లను పరిశీలించిన

# కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**సూర్య బాన్సువాడ రూరల్**

కురిసిన భారీ వర్షాలు జనజీవ నాన్ని తీవ్రంగా ప్రభావితం చేశాయి.వరుస వర్షాల కారణంగా బాన్సువాడలో పలు పాత ఇళ్లు కూలిపోవడంతో ప్రజలు ఇబ్బందు లు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ శనివారం సాయంత్రం సందర్శించి పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించారు. కలెక్టర్‌తో పాటు బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి కూడా ఈ పరిశీలనలో పాల్గొన్నారు. కూలిపోయిన ఇళ్ల సంఖ్య, దెబ్బతిన్న ఆస్తుల వివరాలు, బాధిత కుటుంబాల పరిస్థితి గురించి మున్సిపల్,రెవెన్యూ అధికారులు సమగ్ర సమాచారం అందించారు.బాధిత కుటుంబాలను కలుసుకున్న కలెక్టర్ వారికి తక్షణ సహాయం అందించేందుకు ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ,కూలిపోయిన ఇళ్ల కారణంగా గృహరహితులైన కుటుం బాలకు తాత్కాలిక వసతి కల్పించే చర్యలు తీసుకోవాలని,వారిని ఆదుకోవడంలో ఎటువంటి ఆలస్యం జరగకూడదని సూచించారు.పట్టణంలో వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్లు, విద్యుత్ సరఫరా,డ్రైనేజీ వ్యవస్థలను వేగంగా పునరుద్ధరిం చేందుకు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ చర్యలుచేపట్టామని తెలిపారు.





# చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

**సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి**

ఎస్సారెస్పీ ప్రాజెక్టుకు ఆనుకుని దిగువన గల పోచంపాడ్ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి శనివారం పరిశీలించారు. ఈ కేంద్రంలో చేప పిల్లల ఉత్పత్తి కోసం చేపడుతున్న చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులకు వివరాలు అడిగి తెలుసుకున్నారు. గంబూషియా చేప పిల్లలను పెంచుతున్న ఫిష్ పాండ్స్‌ను సందర్శించారు. గంబూషియా చేప పిల్లలను పెద్ద సంఖ్యలో పెంచాలని, దోమలు వృద్ధి చెందకుండా మురుగు నీటి కాల్వలు, నిలువ నీటి గుంతలలో ఈ చేప పిల్లలను వదలాలని కలెక్టర్ సూచించారు. ముందుగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని అన్ని వార్డులలో మురుగు కాలువలలో గంబూషియా చేప పిల్లలను వదలాలని, అనంతరం బోధన్ భీమ్గల్ మున్సిపాలిటీలలో కూడా వదిలేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా, పూర్తి లక్ష్యం మేరకు నాణ్యమైన చేప పిల్లల ఉత్పత్తి జరిగేలా చూడాలని, ఉత్పత్తి కేంద్రంలో పైప్ లైన్ లు, ఇతర మరమ్మత్తు పనులు వెంటనే చేయించాలని జిల్లా మత్స్య శాఖ అధికారి ఆంజనేయ ప్రసాద్ కు కలెక్టర్ సూచించారు.

# పోచారం ప్రాజెక్టుకు శాశ్వత మరమ్మత్తుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం.

**(మొదటి పేజీ తరువాయి)**

మూడు రోజులుగా కురిసిన భారీగా వర్షాలతో పోచారం ప్రాజెక్టులోకి 1లక్షా 80 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చిందని తెలిపారు. దీంతో ప్రాజెక్టు వద్ద మట్టి కోతకు గురై గుంత ఏర్పడి కొంత నష్టం జరిగిందని ఆయన తెలిపారు. ప్రాజెక్టు వద్ద మరమ్మత్తులు చేపట్టేందుకు వెంటనే స్పందించామని తెలిపారు .ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆదేశాల మేరకు రెవెన్యూ ,నీటిపారుదల శాఖ అధికారులతో పాటు స్థానిక నాయకుల సహకారంతో ప్రాజెక్టు వద్ద మరమ్మత్తు పనులు చేపట్టినట్టు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టు వద్ద తాత్కాలిక మరమత్తు పనులు జరుపుతున్నామని ,వర్షాలు పూర్తిగా తగ్గిపోయిన అనంతరం ప్రాజెక్ట్ వద్ద శాశ్వత మరమ్మత్తు పనుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని, ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే శాశ్వత మరమ్మత్తు పనులు చేపడతామన్నారు. భారీ వర్షాల వల్ల జిల్లాలో జరిగిన నష్టం పైన సంబంధిత శాఖల అధికారుల ద్వారా అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదికను పంపిస్తామన్నారు. అనంతరం ఆయన ప్రాజెక్టు వద్ద గల బోధన్- హైదరాబాద్ జాతీయ ప్రధాన రహదారి భారీ వరద ఉధృతి కారణంగా ధ్వంసమై నాలుగు రోజులుగా రాకపోకలు పూర్తిగా నిలిచిపోవడంతో ధ్వంసమైన ఈ ప్రధాన రహదారిని కలెక్టర్ పరిశీలించారు. శనివారం నుంచి ఈ రహదారికి జాతీయ రహదారి అధికారులు మరమ్మత్తు పనులు ప్రారంభించారని తెలిపారు .రెండు మూడు రోజుల్లో మరమ్మత్తు పనులు పూర్తి చేసి రాకపోకలను పునరుద్ధరించాలని ఆయన జాతీయ రహదారి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థ సింహారెడ్డి, ఇరిగేషన్ డీఈ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో ప్రభాకర్ చారి, డిప్యూటీ తాసిల్దార్ రాజేశ్వర్,ఏఈ అక్షయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, శ్రీధర్ గౌడ్,తాండూర్ సొసైటీ అధ్యక్షుడు గంగారెడ్డి, సీనియర్ నాయకులు, రాంచంద్రారెడ్డి , శ్రీనివాస్ రెడ్డి,దివిటి కిష్టయ్య,ఇమామ్ , సురేందర్ గౌడ్, శ్రీరామ్ గౌడ్, పాల్గొన్నారు.

# ఎస్సారెస్పీని సందర్శించిన కలెక్టర్

**(మొదటి పేజీ తరువాయి)**

ప్రాంతాల నుండి శనివారం మధ్యాహ్నం సమయానికి 4.90 లక్షల క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తోందన్నారు. దీంతో 39 ఫ్లడ్ గేట్లతో పాటు వరద కాలువ, కాకతీయ, సరస్వతీ, లక్ష్మి మెయిన్ కెనాల్స్ ద్వారా దిగువకు 6 లక్షల క్యూసెక్కుల నీటిని వదులుతున్నామని కలెక్టర్ వివరించారు. వరద ఉద్ధృతి వల్ల రిజర్వాయర్ ఎగువ భాగంలోని కందకుర్తి, హున్సా, కొప్పర్గా, హంగర్గా తదితర గ్రామాలను వరద నీరు చుట్టు ముట్టిన నేపథ్యంలో బ్యాక్ వాటర్ ను తగ్గించేందుకు ఎస్సారెస్పీ ద్వారా పెద్ద ఎత్తున 6 లక్షల క్యూసెక్కుల పైచిలుకు నీటిని దిగువ గోదావరి లోకి విడుదల చేయడం జరుగుతోం దని కలెక్టర్ వెల్లడించారు. అయితే ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉందని, ఆయా శాఖల అధికారులను అప్రమత్తం చేసి క్షేత్ర స్థాయిలో ఎప్పటికప్పుడు వరద తీవ్రతను సమీక్షిస్తున్నామని అన్నారు. ప్రస్తుత లెవెల్ వద్ద నీటి నిల్వలను మెయింటైన్ చేస్తూ, ఎగువ నుండి వస్తున్న ఇన్ ఫ్లోకు అనుగుణంగా వరద జలాలను దిగువకు విడుదల చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎస్సారెస్పీ దిగువ ప్రాంతాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని, చేపల వేట, ఈత సరదా కోసం ఎవరు కూడా గోదావరి పరీవాహక ప్రాంతం వైపు వెళ్లకూడదని కలెక్టర్ అన్నారు. ముఖ్యంగా కొడిచెర్ల, చాకిరియాల్, సావెల్, తడపాకల్, దొంచందా, గుమ్మిర్యాల్ గ్రామాల వద్ద ఎవరు కూడా గోదావరి వైపు వెళ్లకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. అధికారులు, సిబ్బంది అందరూ అంకితభావంతో పనిచేయాలని, ప్రాణ నష్టం వంటి అవాంఛనీయ ఘటనలు సంభవించకుండా అవసరమైన అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని హితవు పలికారు. భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో అప్రమత్తతతో కూడిన చర్యలు చేపడుతోందని, పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉందని, ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ భరోసా కల్పించారు. లో లెవల్ వంతెనలు, కాజ్ వేల మీదుగా, రోడ్ల పై నుండి వరద జలాలు ప్రవహిస్తున్న మార్గాలలో ప్రతి చోట అధికారులు, సిబ్బందిని అందుబాటులో ఉంచి, పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని అన్నారు. వరద ప్రభావిత గ్రామాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించామన్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపడుతున్నామని, ప్రజలు కూడా అప్రమత్తంగా ఉంటూ అధికార యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్ కోరారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ సబ్ కలెక్టర్ ప్రజ్ఞాన్ మాల్వియా, ఎస్సారెస్పీ, ఇరిగేషన్ అధికారులు శ్రీనివాస్, రామారావు, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన మాజీ ఎంపీ బీబీ పాటిల్

**సూర్య నిజాంసాగర్**



మండలంలోని వడ్డేపల్లి గ్రామ శివారులో నీటి గుంతలో పడి మరణించిన వడ్డే వెంకటి కుటుంబానికి జహీరాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యులు బీబీ పాటిల్ 11వేల రూపాయల నగదు ఆర్థిక సహాయాన్ని అందించారు. శనివారం పిట్లం నిజాంసాగర్ ప్రధాన రహదారి పక్కన నీటి గుంతలో నుండి మృతదేహాన్ని వెలికితీస్తుండగా నిజాంసాగర్ వైపు వెళ్తున్న ఆయన జనాలు ఎక్కువమంది ఉండడంతో ఏం జరిగిందని ఆయన వాహనం ఆపి అడిగారు. వీటి గుంతలో పడి వ్యక్తి మృతి చెందాడని అక్కడ ఉన్న జనాలు ఆయన సూచించారు. విషయం తెలుసుకున్న ఆయన కారులో నుండి దిగి సంఘటన స్థలంలో మృతదేహాన్ని చూసి మృతుని తమ్ముడు రవికి 11,000 రూపాయల నగదు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఆయనతో పాటు పిట్లం బిజెపి నాయకులు జగదీష్, సాలె గంగాధర్, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

## వరద ప్రాంతంలో ఆరోగ్య శిబిరం..

**సూర్య- నవీపేట్**



ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి నది పరివాహక ప్రాంతమైన మిట్టాపూర్ గ్రామం చుట్టూ వరద నీరు చేరడంతో రెండు రోజులుగా జలదిగ్బంధంలో చిక్కుకుంది. రాకపోకలు నిలిచిపోవడంతో తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. స్వాతి అనే నిండు గర్భిణి తోపాటు వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ముగ్గురిని ఆరోగ్య సిబ్బంది ప్రైవేట్ బోటును ఏర్పాటు చేసి బోటు సాయంతో ఆసుపత్రికి తరలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామంలో ఎలాంటి సిజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా శనివారం ఆరోగ్య సిబ్బంది ఏఎన్ఎం విజయలక్ష్మి, ఆశా వర్కర్ గోదావరి బోటు సాయంతో గ్రామంలోకి వెళ్లి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. గ్రామస్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పంచాయతీ కార్యదర్శి అర్చన అక్కడే ఉండి చర్యలు చేపడుతున్నారు. వరద తగ్గుముఖం పడుతుండడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకుంటున్నారు.

## కూలిన ఇండ్లను పరిశీలించిన తహసీల్దార్ సువర్ణ.

**సూర్య నసురుల్లాబాద్**



నస్రుల్లాబాద్ మండల పరిధిలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పలు గ్రామా ల్లో ఇళ్లు కూలిపోయాయి. శుక్రవారం పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించి న తహసీల్దార్ సువర్ణ బాధిత కుటుంబాలను పరామర్శించా రు.పలు గ్రామంలో ఒకటి రెండు ఇళ్లు కూలినట్టు గుర్తించిన తహసీల్దార్ వివరాలను సమగ్ర నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు పంపిస్తామనితెలిపారు.వర్షాల కరణంగాఇల్లుకోల్పోయిన వారికి ప్రభుత్వ నుండి సహాయం అందేలా చర్యలుచేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ సువర్ణతో పాటు ఎంపీడీవో రమేశ్వర్ గౌడ్, ఆర్ఐ, గ్రామ కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తెయూ ఎన్ ఎస్ యూఐ నూతన కమిటీ ఎన్నిక

**సూర్య మోపాల్**

తెలంగాణ రాష్ట్ర ఎన్ ఎస్ యూ ఐ అధ్యక్షులు ఎడవెల్లి వెంకటస్వామి,రాష్ట్ర జనరల్ సెక్రెటరీ వేణు రాజ్ ఆదేశాల మేరకు తెలంగాణ యూనివర్సిటీలో నూతనంగా నేషనల్ స్టూడెంట్ యూనియన్ ఆఫ్ ఇండియా కమిటీ ఎన్నుకున్నారు. యూనివర్సిటీ ఎన్ ఎస్ యూ ఐ ప్రెసిడెంట్ గా చౌదర్పల్లి మహేష్, వైస్ ప్రెసిడెంట్ గా అరుణ్ తేజ, జనార్ధన్,శివప్రసాద్, జనరల్ సెక్రటరీ గా అలియాస్,అనిల్, తిరుపతి,శివ,బాలాజీ జాయింట్ సెక్రటరీ గా జయంత్, సృజన్,సునీల్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గా దినేష్, మధు మెంబర్స్ గా నితిన్, తరుణ్,మధు,రాజేందర్, కళ్యాణ్,శ్రావణ్,గోవింద్, ముఖేష్,శివ లను ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ యూ ఐ మాజీ అధ్యక్షులు బానోత్ సాగర్ నాయక్ మాట్లాడుతూ విద్యార్థుల సమ స్యలపై పోరాడే ఆర్గనైజేషన్ ఎన్ ఎస్ యూ ఐ ప్రతినిత్యం విద్యార్థుల కొరకు పనిచేస్తూ ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు శ్రీశైలం,జనరల్ సెక్రెటరీ నవీన్ పాల్గొన్నారు.



## పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా ఆరోగ్యంగా గడపాలి

**(మొదటి పేజీ తరువాయి)**

కుటుంబానికి దూరంగా ఉంటూ ఎన్నో త్యాగాలతో ప్రజలకు సేవలు అందించడం గొప్ప గర్వకారణమని అన్నారు. పోలీసు శాఖలో వారు అందించిన సేవలు మరువలేనివని, ఉమ్మడి జిల్లా ప్రశాంత వాతావరణంలో నిలదొక్కుకునేలా సంఘవిద్రవ శక్తులతో పోరాటంలో వీరి పాత్ర విశేషమని అభినందించారు.అలాగే సుదీర్ఘ కాలం సర్వీస్ పూర్తి చేసి రిటైర్ అవ్వడం అభినందనీయమని,వీరి అనుభవం, సేవలు భవిష్యత్తు తరాలకు స్ఫూర్తి దాయకమని,పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారుఎండి. యూ సుఫ్ 1985లో పోలీసు కానిస్టేబుల్‌గా సేవలను ప్రారంభించి దాదాపు 41 ఏళ్లు,కె. చంద్ర శేఖర్ పోలీసు కానిస్టేబుల్‌గా సేవలు ప్రారంభించి దాదాపు 36 ఏళ్లు విధులు నిర్వర్తించారు. చివరగా జిల్లా ఎస్పీ సిబ్బంది కరతాళ ధ్వనులతో వీరికి వీడ్కోలు పలికారు.ఈ కార్యక్రమంలో యస్బి ఇన్స్పెక్టర్ శ్రీధర్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ సంతోష్, నవీన్ కుమార్, కుటుంబ సభ్యులు, పోలీసులు పాల్గొన్నారు.

## వర్షాలకు దెబ్బతిన్న ఇండ్లను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

**సూర్య బోధన్**



బోధన్ శాసనసభ్యులు సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు గత మూడు రోజులుగా మంజీరా నది వరద ముంపులో విలవిల్లాడుతున్న సాలూరు మండలంలోని హుంసా మంధర్నా, ఖాజాపూర్ గ్రామాలను సందర్శించి దెబ్బతిన్న పంట పొలాలు, రోడ్స్ మరియు ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ మూడు గ్రామాలలో దెబ్బతిన్న రోడ్ల పరిస్థితి, దెబ్బతిన్న పంటపొలాలు, ఇండ్లు వంటి సమస్యలను శాసనసభ్యులు సుదర్శన్ రెడ్డి ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి మూడు గ్రామాల ప్రజ లకు తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బోధన్ ఏఎంసి చైర్మన్ చీల శంకర్, పిఆర్టియు మాజీ జిల్లా అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఇల్తేపు శంకర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంధర్నా రవి, మాజీ ఎంపీటీసీ మరిగే శివ కుమార్, ఖాజాపూర్ అశోక్, డిస్కో సాయిలు, గాండ్ల రాజేశ్వర్, శివకాంత్, సోక్కం రవి, ప్రశాంత్, మూర్గే శంకర్, ఇతర కాంగ్రెస్ నాయకులు, పంచాయతీ రాజ్, ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ ఇఇ, డి.ఇ, ఏ.ఈ రైతులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబ సభ్యులకు నిత్యవసర సరుకుల పంపిణీ

**సూర్య- బిక్కనూర్**



మండల కేంద్రంలో మూడు రోజుల పాటు కురిసిన భారీ వర్షానికి నష్టపోయిన బాధితులకు శనివారం మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తాటిపాముల విజయ్ కుమార్ గౌడ్ నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 సంవత్సరాల కాలంలో ఇలాంటి విపత్తు ఎప్పుడు మండలంలో జరగలేదని, ప్రభుత్వం ముందుగా అప్రమత్తమై ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకుందని ఆయన చెప్పారు. తనవంతుగా పట్టణంలో పర్యటించి బాధిత కుటుంబాలకు నిత్యవసర సరుకులను అందించినట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, మాజీ వైస్ ఎంపీపీ తాటిపాముల లింబాద్రి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అందే దయాకర్ రెడ్డి, సింగిల్ విండో సొసైటీ డైరెక్టర్ సాజిద్, పార్టీ నాయకులు పాల్గొన్నారు

## నీటి గుంతలో పడి వ్యక్తి మృతి

**సూర్య నిజాంసాగర్**



మండలంలోని వడ్డేపల్లి గ్రామ శివారులో నీటి గుంతలో పడి వడ్డే వెంకటి అనే వ్యక్తి మృతి చెందాడు. నిజాంసాగర్ ఎస్సై శివకుమార్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వడ్డేపల్లి గ్రామానికి చెందిన వడ్డే వెంకటి( 40) అనే వ్యక్తి శుక్రవారం ఉదయం 10 గంటలకు వడ్డేపల్లి గ్రామ శివారులో పశువులను మెపడానికి వెళ్లి సాయంత్రం అయిన ఇంటికి రాకపోయేసరికి కుటుంబ సభ్యులు అతని ఆచూకీ గురించి వెతకగా ఉదయం గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో మూర్ఛ వ్యాధి (పిడుసు) వచ్చి మిషన్ భగీరథ నూతిలో పడి చనిపోయాడు అన్నారు. మృతుని తమ్ముడు వడ్డే రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. సంఘటనా స్థలంలో మృతదేహాన్ని ఏఎస్ఐ సాయిలు సిబ్బందితో కలిసి వెళ్లి వివరాలను సేకరించారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# ఎన్.డీ.ఆర్.ఎఫ్, ఎస్.డీ.ఆర్.ఎఫ్ సేవలు భేష్

**- ప్రశంసించిన కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి**

**సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి**

ఏకధాటిగా కురిసిన భారీ వర్షాలతో నిజామాబాద్ జిల్లాలో వరద ప్రభావానికి లోనైన ప్రాంతాలలో ఎన్.డీ.ఆర్.ఎఫ్, ఎస్.డీ.ఆర్.ఎఫ్ బృందాలు అందించిన సేవలు ప్రశంసనీయమని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అభినందించారు. జాతీయ, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళాలు కనబరచిన తెగువ, కృషి కారణంగా జిల్లాలో ఎక్కడ కూడా ప్రాణనష్టం వంటి సంఘటనలు చోటుచేసుకోకుండా నివారించగలిగామని అన్నారు. వరదల వల్ల జల దిగ్బంధంలో చిక్కుకుపోయిన ఆయా గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో విపత్తు ప్రతిస్పందన దళాలు సాహసోపేతమైన కృషిని కనబర్చాయని అన్నారు. ఎప్పటికప్పుడు జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ ఎన్.డీ.ఆర్.ఎఫ్, ఎస్.డీ.ఆర్.ఎఫ్ బృందాలు ఆధునిక పరికరాలతో రక్షణ చర్యలు చేపట్టాయని తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో బోట్ల సహాయంతో పాటు ట్రాక్టర్లు, జేసీబీల ద్వారా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో విపత్తు ప్రతిస్పందన దళాలు ఎంతో గొప్పగా సేవలు అందించాయని అన్నారు. ఎగువ



ప్రాంతాల నుండి వరద పోటెత్తడంతో నిజామాబాద్ జిల్లాలోని మంజీరా పరీవాహక ప్రాంతాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయని గుర్తు చేశారు. ఇతర ప్రాంతాల నుండి రాకపోకలు తెగిపోయి వరద నీరు గ్రామాలలోకి వచ్చి చేరుతున్న క్రమంలో జిల్లా యంత్రాంగం తక్షణమే అప్రమత్తమై విపత్తు ప్రతిస్పందన దళాల సేవలను వినియోగించుకుందని కలెక్టర్ తెలిపారు. సమాచారం అందించిన వెంటనే విపత్తు ప్రతిస్పందన దళాలు వరద ప్రభావిత ప్రాంతాలకు చేరుకొని తక్షణ సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయని అన్నారు. బోధన్ మండలం హంగర్గ గ్రామంలో వరదల్లో చిక్కుకున్న సుమారు 480 మందిని ఎన్.డీ.ఆర్.ఎఫ్ బృందాలు రెస్క్యూ చేశాయని అన్నారు. అదేవిధంగా రెంజల్ మండలం కందకుర్తి వద్ద సీతారాం త్యాగి మహారాజ్ ఆశ్రమంలో వరదలలో చిక్కుకున్న 8 మందిని విపత్తు సహాయక బృందాలు ప్రాణాలకు తెగించి కాపాడారని, ఆశ్రమంలోని మూగ జీవాలకు కూడా అవసరమైన మేత, నీటి వసతిని సమకూర్చారని కలెక్టర్ వివరించారు. సాలూర మండలంలోని మందర్న, హున్సా, ఖాజాపూర్ గ్రామాలలో జలదిగ్బంధంలో చిక్కుకున్న 120 మందిని బోట్ల ద్వారా ఎస్.డీ.ఆర్.ఎఫ్, 7వ పోలీస్ బెటాలియన్ బృందాలు రక్షించాయని తెలిపారు. సుమారు 12 అడుగుల ఎత్తుతో కొనసాగిన వరద ప్రవాహ ఉధృతిని దాటుకుని ప్రజలను సురక్షిత ప్రదేశాలకు చేర్చారని అన్నారు. ముత్యాల చెరువు తెగడంతో దర్పల్లి మండలం వాడి గ్రామాన్ని వరద నీరు చుట్టుముట్టగా, ఎస్.డీ.ఆర్.ఎఫ్ బృందం హుటాహుటిన చేరుకొని సహాయక చర్యలు కొనసాగించిందని తెలిపారు. ఇదే రీతిలో జిల్లాలోని వివిధ ప్రాంతాలలో వరదలలో చిక్కుకున్న వారిని సురక్షిత ప్రాంతాలకు చేరవేసేందుకు ఎన్.డీ.ఆర్.ఎఫ్, ఎస్.డీ.ఆర్.ఎఫ్ బృందాలు సాహసోపేతమైన కృషిని కొనసాగించాయని కలెక్టర్ అభినందించారు.

## వర్ష ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన భాస్కర్ రెడ్డి

**సూర్య బాన్సువాడరూరల్**



గత మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాల కారణంగా బాన్సువాడ గ్రామీణ మండల పరిధిలో అనేక ప్రాంతాలు తీవ్ర నష్టాన్ని చవిచూశాయి .ముఖ్యంగా కోనాపూర్ సంగోజీపేట రహదారిపై ఉన్న బ్రిడ్జి వద్ద వరద నీటి ఉధృతి కారణంగా రోడ్డు కల్వర్టు కోతకు గురైంది. రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వరద ప్రవాహం పంట పొలాలపైకి చేరడంతో వరి,మక్కజొన్న పంటలు నీట మునిగి రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, స్థానిక నాయకులు,అధికారులతో కలిసి ప్రభావిత ప్రాంతాలను శనివారం సందర్శించారు.వరద వల్ల నష్టపోయిన రహదారి, కల్వర్టు,ఇసుక మేటలతో నిండిపోయిన పంట పొలాలను ప్రత్యక్షంగా పరిశీలిం చారు.బాధిత రైతులతో మాట్లాడి వారిసమస్య లను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ప్రజలకు ఎదురైన ఇబ్బందులపై అధికారులతో మాట్లాడి నష్ట పరిహారం అందేలా కృషి చేస్తానన్నారు.కూలిపోయిన రోడ్డు,దెబ్బతిన్న కల్వర్టులు వెంటనే మరమ్మత్తులు చేపడతామన్నా రు.రైతుల పంటలకు సరైన అంచనా వేసి నష్ట పరిహారం అందేలా చూస్తానన్నారు.తాను ఎల్లప్పుడూ ప్రజలతోపాటు ఉంటా నని,ఈ కష్టకాలంలో బాధితులకు పూర్తి స్థాయిలో అండగానిలబడ తానని భరోసా ఇచ్చారు

## రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పలు సహాయ కార్యక్రమాల తో పాటు అన్నదాన కార్యక్రమం

**సూర్య కామారెడ్డి టౌన్**




జి ఆర్ కాలనీలో శనివారం రోజున రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సహాయ కార్యక్రమాలు. ఎడతెరిపి లేకుండా వర్షాల కారణంగా కామారెడ్డి లోని జి ఆర్ కాలనీ, హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఇళ్లన్నీ బురదమయం కావడం వలన ఈరోజు రోటరీ క్లబ్ అలాగే వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇళ్లను శుభ్రపరచడంలో వారికి ఉదయం నుండి మధ్యాహ్నం వరకు సహాయం చేయడం జరిగింది. ప్రతి ఇంటికి వెళ్లి క్లీన్ చేస్తూ వారికి అండగా ఉన్నామని చెప్పి ,సపోర్ట్ చేస్తూ అలాగే మధ్యాహ్నం అక్కడున్న వారందరికీ భోజన వసతి కల్పించడం జరిగింది. ఇందుకు కామారెడ్డి కలెక్టర్ అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ డాక్టర్ ఎం జైపాల్ రెడ్డి మాట్లాడుతూ విపత్కర సమయంలో రోటరీ క్లబ్ ముందుంటుందని తెలియజేస్తూ కామారెడ్డి లో ఇప్పటి వరకు ఇలా జరగలేదని తెలియజేస్తూ ప్రతి ఒక్కరికి ధైర్యాన్ని అందిస్తూ ముందుకెళ్లడం జరిగింది.ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ , RK విద్యా సంస్థల ప్రతినిధులు ,వివిధ సంస్థలు మరియు రోటరీ అధ్యక్షులు శంకర్, సెక్రటరీ సబ్బని కృష్ణ హరి ట్రెజరర్ వెంకట రమణ,రోటరీ మెంబర్స్ రాజనర్సింహారెడ్డి,సుధాకర్,బాలకిషన్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సుధాకర్ రావు,శ్యామ్ గోపాల్, నాగరాజు ,నవీన్ కుమార్, గిరిగంటి లక్ష్మీనారాయణ,ఆర్మీ కోచ్ రాజేష్ వాలంటీర్స్ మరియు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పంట నష్టాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలి

**- ఎకరాకు రూ. 30వేలు నష్టపరిహారం చెల్లించాలి**

**- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు నూర్జహాన్ డిమాండ్లి**

**సూర్య ఇందూర్**



భారీ వర్షాలకు తెలంగాణ రాష్ట్రం లోని రైతాంగం పంట నీట మునిగి పూర్తిగా నష్టపోయిందని ఈ విపత్తు ను కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు నూర్జహాన్ డిమాండ్ చేశారు. శనివారం రుద్రూర్ మండల కేంద్రంలోని భారీ వర్షాలకు నష్టపోయిన పంట పొలాల ను పార్టీ నాయకులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పంట నష్టపోయిన రైతులకు ఎకరా కు రూ. 30 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పంట పొలాలతో పా టు, ఇండ్లు ధ్వంసమై నిరాశ్రయులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గుంతలు ఏర్పడిన రోడ్లకు మన మతులు చేపట్టాలని కోరారు. నష్టపోయిన నిరుపేద కుటుంబాలకు నిత్యవ సర సరుకులు అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శంకర్ గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు విగ్నేష్, ఏరియా కార్యదర్శి నన్నేసాబ్, మండల కన్వీనర్ నెల్లూరి లక్ష్మణ్, నాయకులు భీమయ్య, అశోక్, భూమయ్య, కిరణ్, రెడ్డి, భూషణం, కుమార్, ఎక్బాల్ తదితరులు పాల్గొన్నారు

## నష్టపోయిన కుటుంబాలను ఆదుకోవాలి

**-చందూరి హన్మాండ్లు**

**సూర్య నస్రుల్లాబాద్.**



నసురుల్లాబాద్ మండల పరిధిలో వర్షాల కారణంగా పంటలు నీటమునిగిపోయి,అనేక ఇళ్లు కూలిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు చందూరి హన్మాండ్లు అన్నారు.శనివారం ఆయన బాధిత గ్రామాలను సందర్శించి పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షం కారణంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే సహాయం అందించా లన్నారు. ప్రతి ఎకరానికి 25,000 ఆర్థిక సాయం ప్రకటించాలి, కూలిపోయిన ఇళ్లకు వెంటనే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు అత్యవసర నిత్యావసర సరుకులు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఓబీసీ జిల్లా కార్యవర్గ సభ్యులు వడ్ల సతీష్, గిరిజన మోర్చా అసెంబ్లీ కన్వీనర్ శంకర్ నాయక్, మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, మండల ఉపాధ్యక్షులు శేఖర్, పేరక రాములు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## జేఏసీ ఉద్యోగుల సమస్యల పై కలెక్టర్ కు వినతి పత్రం

**సూర్య ఇందూర్**



ఉద్యోగుల సమస్యలపై జేఏసీ జిల్లా పక్షాన కలెక్టర్ కు వినతి వినతి పత్రం అందజేశారు.శనివారం జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ని,ఐడిఓసి కార్యాలయం వారి ఛాంబర్ నందు,ఎంప్లాయిస్ జేఏసీ నిజామాబాద్ జిల్లా పక్షాన మర్యాదపూర్వకంగా కలిసి,ఉద్యోగుల సమస్యలపై ఎంప్లాయిస్ జేఏసీ రాష్ట్ర కమిటీ విడుదల చేసిన కార్యాచరణకు అనుగుణంగా సెప్టెంబర్ 1వ తేదీ నుండి జిల్లా కేంద్రంలో నిర్వహించే ఉద్యమ కార్యచరణ, నిరసన కార్యక్రమాల వివరాలను తెలియజేసి, వినతిపత్రం అందజేశారు.ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్,టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు నాశెట్టి సుమన్ కుమార్,కో చైర్మన్లు ఎల్. రమణ రెడ్డి,ధర్మేందర్,వైస్ చైర్మన్లు నేతికుంట శేఖర్, ప్రశాంత్, రమణాచారి,జమీల్ ఉల్లా, ఫైనాన్స్ సెక్రటరీ జాకీర్ హుస్సేన్,కార్యవర్గ సభ్యులు చిట్టి నారాయణరెడ్డి,పోల శ్రీనివాస్,జాఫర్ హుస్సేన్, మాణిక్యం, మంగమ్మ, శ్రీవేణి,గీతారెడ్డి,సునీల్, స్వామి,శ్రీనివాస్,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నిరాశ్రాయులకు బోజనం ఎర్పాటు

**సూర్య రాజంపేట**



గత మూడు రోజుల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో నిరాశ్రయులై గ్రామ పంచాయితీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆశ్రయం పొందుతున్న రాజంపేట గ్రామానికి చెందిన 42 మందికి రాజంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మెన్ నల్లవెల్లి అశోక్ శనివారం భోజన వసతి ఎర్పాటు చేశారు. గ్రామ పెద్దలు తమ వంతు సహకారం అందించడం అభినందనీయం అని పంచాయితీ కార్యదర్శి అశోక్ కుమార్తెలిపారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం డైరెక్టర్లు బాలయ్య, కట్లకుంట సిద్దిరాములు, రాజిరెడ్డి, పిట్ల స్వామి, భూస సింహం గ్రామ పంచాయితీ సిబ్బంది గంగధర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో ఆరోగ్య సేవలు వేగవంతం

**సూర్య- బిక్కనూర్**



భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో మండలంలో శనివారం వైద్య సేవలను వేగవంతం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉపవైద్యాధికారి ప్రభు కిరణ్ మండలంలోని అన్ని గ్రామాలలో ఏర్పాటుచేసిన ప్రత్యేక వైద్య శిబిరాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందు జాగ్రత్త చర్యగా అన్ని గ్రామాలలో వైద్య సేవలను ముమ్మరం చేసినట్లు చెప్పారు. అలాగే వసతి గృహాలలో విద్యార్థులను అప్రమత్తం చేసినట్లు ప్రజలు ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి హేమీమా, ఆరోగ్య విస్తీర్ణ అధికారి వెంకటరమణ, ఆరోగ్య సిబ్బంది ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి

**సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి**

హైదరాబాదులో శాసనసభ సమావేశం అనంతరం సీఎం రేవంత్ రెడ్డిని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతి రెడ్డి కలవడం జరిగింది.నిజామాబాద్ జిల్లాలో జరిగిన వరద నష్టం గురించి సీఎం రేవంత్ రెడ్డికి వివరించడం జరిగింది.సీఎం రేవంత్ రెడ్డి తో నిజామాబాద్ జిల్లాలో,నిజామాబాద్ రూరల్ నియోజవర్గంలో గత రెండు రోజులుగా కురిసిన వర్షం వల్ల పంటలు, రోడ్లు,విద్యుత్, కరెంటు స్తంభాలు,బ్రిడ్జ్ లు ఎంత నష్టం జరిగిందో సీఎంకు వివరించడం జరిగిందని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి తెలిపారు. అలాగే పంచాయతీరాజ్



శాఖ వ్యవసాయ శాఖ, ఇరిగేషన్ శాఖ,విద్యుత్ శాఖ,రోడ్ల భవనాలు శాఖ లు సమన్వయంతో పనిచేసి నిజామాబాద్ జిల్లాలో,నిజామాబాద్ రూరల్ నియోజవర్గంలో ఎంత వరద నష్టం జరిగిందో అంచనా వేసి సీఎంకు పంపాలని ఇప్పటికే కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారని అన్నారు.నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి రూరల్ నియోజకవర్గంలో జరిగిన ఆస్తి నష్టం,పంట నష్టం,రోడ్లు కరెంటు స్తంభాలు ట్రాన్స్ఫర్ లు ధ్వంసం గురించి సీఎం కు వివరించారు.సిఎం సానుకూలంగా స్పందించి నిజామాబాద్ జిల్లా కలెక్టర్ కు అన్ని శాఖల సమన్వయంతో వరద వల్ల పూర్తి నష్టాన్ని అంచనాలు వేసి నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారని ఆయన అన్నారు. హైదరాబాదులో సోమవారం రోజు సీఎం జిల్లాలో జరిగిన వరద నష్టం పై కలెక్టర్లతో రివ్యూ చేస్తున్నారని రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి తెలిపారు.

## కందకుర్తి ఇందిరమ్మ కాలనీ చుట్టుముట్టిన గోదావరి జలాలు

**సూర్యా రెంజల్**



గత నాలుగైదు రోజుల కిందట కురిసినటువంటి వర్షాలకు భారీ ఎత్తున ఎగువ ప్రాంతాల నుండి వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తూ, కందకుర్తి త్రివేణి సంగమ గోదావరిలో ఉప్పెనగ ఉప్పొంగు తూ పరుగులు పెడుతుంది. రెంజల్ మండలంలోని కందకుర్తి గ్రామపంచాయతీ పరిధిలో గల ఇందిరమ్మ కాలనీలోకి శుక్రవారం సాయంత్రం నుండి ఉదయం వరకు భారీ ఎత్తున వరద నీరు చేరుకోవడంతో కాలనీ ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. నీలా, పేపర్ మిల్, కందకుర్తి, తాడి బిలోలి, బోర్గం శివార్లలో వరద నీటితో సుమారు 6 వలకు పైగా పంటలు పూర్తి స్థాయిలో నీట మునిగిపోయాయి. శనివారం సాయంత్రం వరకు కూడా వరద నీరు ఎటువంటి మార్పు లేకుండా ప్రవహిస్తూనే ఉంది. లక్షల క్యూసెక్కులకు పైగా నీరును ఎస్సారెస్పీ ప్రాజెక్టు ద్వారా దిగువ ప్రాంతానికి వదులుతున్నప్పటికీ ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ మాత్రం తగ్గుముఖం పట్టడం లేదు. అధికారులు నదీ పరివాహక ప్రాంత ప్రజలకు అప్రమత్తం చేస్తున్నారు.

## ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

**సూర్య రెంజల్**



పర్యావరణాన్ని రక్షించేందుకై, ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని శివాజీ సేవాస మితి ఆధ్వర్యంలో స్టీల్ బ్యాక్ అనే కార్యక్రమాన్ని చేపట్టారు. శనివారం రెంజల్ మండల కేంద్రంలో శివాజీ సేవా సమి తి ఆధ్వర్యంలో గ్రామం లోని గణేష్ మండపాల వద్ద ఏర్పాటు చేసే అన్న ప్రసాద్ అన్న కార్యక్రమా లు సందర్భంగా ప్లాస్టిక్ వాడకం నిర్మూలన కొరకు ఉచితంగా స్టీల్ ప్లేట్లను, గ్లాసులను అందించడం జరుగుతుందన్నారు. గ్రామంలో వివిధ శుభకార్యా లకు కానీ, ఇతర కార్యక్రమాలకు కానీ ప్లాస్టిక్ ను వాడకుండా స్టీల్ ప్లేట్లను వాడిందుకై ఉచితంగా శివాజీ సేవా సంస్థ వారు అందించడం జరుగుతుం దని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెంజల్ శివాజీ సేవా సంస్థ నిర్వాహ కులు పాల్గొన్నారు.

## కుక్కల దాడిలో ఇద్దరు చిన్నారులకు గాయాలు

**సూర్య నసురుల్లాబాద్**



నస్రుల్లాబాద్ మండలం నాచుపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో వీధి కుక్కల ఉన్మాదం కొనసాగుతోంది. శనివారం మధ్యాహ్నం ఆటలాడుతున్న శ్రేయస్ (3), సర్వేష్ (5) పై ఒక్కసారిగా కుక్కలు దాడి చేసి తీవ్ర గాయపరిచాయి.పిల్లల అరుపులు విన్న తల్లిదండ్రులు పరుగెత్తుకుంటూ వచ్చి వారిని కాపాడారు.వెంటనే చికిత్స కోసం దవాఖానకు తరలించారు. గ్రామంలోని ఆలయానికి చెందిన ఆవులను కూడా కుక్కలు దాడి చేసి గాయపరిచిన ఘటన కలకలం రేపింది.ఇదే నెలలో రెండోసారి కుక్కల దాడులు చోటుచేసు కోవడంతో గ్రామంలో భయాందోళ నలు నెలకొన్నాయి. అధికారులు తక్షణమే చర్యలు తీసుకొని గ్రామ ప్రజలను రక్షించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## కర్షక యువజన గణేష్ మండలికి 50 ఏళ్లు..

**సూర్య- నవీపేట్**



మండల కేంద్రంలో గల దర్యాపూర్ శ్రీ వీరాంజనేయ కర్షక యువజన గణేష్ మండలి 50వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం గణేష్ మండప నిర్వాహకులు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదాన ఏర్పాటు చేశారు. వినాయక భక్తులతో పాటు గ్రామ పెద్దలు, యువతి యువకులు, అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ. గత 50 ఏళ్లుగా వినాయక చవితికి స్థానిక ప్రజల సహకారం మరువలేనిదని, భవిష్యత్తులో సైతం అందరి సహాయ సహకారలతో శ్రీ వీరాంజనేయ కర్షక యువజన గణేష్ మండలిని ఇలాగే కొనసాగిస్తామని సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిల్లి శ్రీకాంత్, బండారి రాజశేఖర్, సందీప్, నరేష్, రవి, నర్సయ్య, శేఖర్, చిన్ను తదితరులు పాల్గొన్నారు.

## వర్షాలకు దెబ్బతిన్న...

**- పంటలను పరిశీలించిన బిఆర్ఎస్ నాయకులు**

**సూర్య బోధన్**



బోధన్ మాజీ శాసన సభ్యులు మహమ్మద్ షకీల్ అమీర్ ఆదేశాల మేరకు గత మూడు రోజులుగా మంజీరా నది వరద నీరు ముంపులో చిక్కుకున్న సాలూరు మండలంలోని హుంసా మంధర్నా, ఖాజాపూర్ గ్రామాలను సందర్శించి దెబ్బతిన్న పంట పొలాలు, రోడ్లు, ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు గిర్దావర్ గంగారెడ్డి మాట్లాడుతూ మూడు గ్రామాలలో దెబ్బతిన్న రోడ్ల పరిస్థితి, దెబ్బ తిన్న పంటపొలాలు, ఇండ్లు వంటి సమస్యలను తక్షణమే పరిష్కరించి రైతులకు పంట నష్టపరిహారం అందించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జాడీ నరసన్న, హుంస జక్క నాగరాజ్, పటేల్ నరేందర్, మందర్న గ్రామానికి చెందిన ముప్పడి లక్ష్మణ్ వాగ్మరే, నాగురావు, నరేశ్, రాము అలాగే బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు

## రాజకీయ పార్టీలతో సమావేశం

**సూర్య మాక్లూర్**



ఓటర్ జాబితాపై రాజకీయ పార్టీలతో శనివారం మాక్లూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో బ్రహ్మానంద రెడ్డి సమావేశం నిర్వహించారు.మండల వ్యాప్తంగా గ్రామ పంచాయతీ కార్యాలయాలలో ఓటర్ జాబితాను ప్రదర్శించడం జరిగిందని ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఆయా పార్టీల వారు తెలియజేయాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్,కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవి ప్రకాష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకటేశ్వర్ రావు, బిఆర్ఎస్ నాయకులు కోక హైమద్,బీజేపీ నాయకులు సంతోష్,తదితరులు పాల్గొన్నారు.

## క్రెడా మహాగణపతి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం

**సూర్య కామారెడ్డి టౌన్**



క్రెడా ఆధ్వర్యంలో మహాగణపతి మొదటి వార్షికోత్సవ సందర్భంగా శనివారం రోజున గణపతి ఉత్సవాలనూ పురస్కరించుకొని మహాగణపతి అన్న ప్రసాదాన్ని శనివారం మధ్యాహ్నం ఘనంగా నిర్వహిం చడం జరిగింది. ఈ కార్యక్రమంలో క్రెడ అధ్యక్షులు నర్సాగౌడ్ ఉపాధ్య క్షులు దేవదాస్ కార్యదర్శి రామచంద్రనాయక్ కోశాధికారి రాజలి ంగం సలహాదారు గంజి సతీష్ రాధా కిషన్ శంకర్ గౌడ్ దేవసేన పటేల్ శ్రీనివాస్ ప్రేమ్ నాయక్ శ్రీనివాస్ రామ్ రెడ్డి సంజీవరెడ్డి రవీందర్ రెడ్డి శ్రీనివాస్ మచ్చ రాజయ్య దినేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు, ఆదివారం రోజున నిమజ్జనం చేయడం జరుగుతుందని క్రెడ అధ్యక్షులు లక్ష్మీ నరస గౌడ్ తెలిపారు.

## రక్తదానం మహత్తర సేవ

**- బిచ్కుంద ఎస్సై మోహన్‌రెడ్డి**

**సూర్య నిజాంసాగర్**



రక్తదానం మహత్తరసేవ అని బిచ్కుంద ఎస్సై మోహన్ రెడ్డి అన్నారు. శనివారం బిచ్కుంద మండల కేంద్రంలో ఏ ఎస్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరంలో పలువురు ఉపాధ్యా యులు పాల్గొని రక్తదానం చేశారు. రక్తదానం చేసిన ఉపాధ్యాయులు ఖయ్యుమ్, షేక్ అహ్మద్‌లకు ఎస్ఐ మోహన్‌రెడ్డి సర్టిఫికెట్ లు అందజే శారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రక్తదానం ద్వారా ఒకేసారి ఇద్దరి ప్రాణాలను కాపాడగలగడం సాధ్యం అన్నారు. రక్తదానం చేయడం వల్ల వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని,.ఇది అత్యంత మానవతా సేవ అన్నారు. యువత ముందుకు వచ్చి రక్తదానం చేయాలన్నారు. ఇలాంటి సామాజిక కార్యక్రమాలు మరింత విస్తృతం కావాలన్నారు. రక్తదానం చేసిన ఉపాధ్యా యులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏ ఎస్ ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు సామాజిక కార్యకర్త అయ్యల సం తోష్, ఫౌండేషన్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

## వరద బాధితులకు బ్లాంకెట్స్ దుప్పట్ల పంపిణీ చేసిన పి పి శ్యాం గోపాల్ రావు

**సూర్య కామారెడ్డి టౌన్**



గత మంగళవారం నుండి మూడు రోజుల పాటు భారీ వర్షాల నేపథ్యంలో కామారెడ్డి జిల్లా కేంద్రం మతలకూతలమైన విషయం అందరికి తెలిసిందే. కామారెడ్డి పట్టణంలోని జి ఆర్ కాలనీ పూర్తిగా అందరి ఇళ్లలోకి నీరు చేరి బాధితులను చేసిన ప్రకృతి విలయతాండవంతో పలు వురు బాధితులు రోడ్డున పడ్డారు ఇంట్లో పూర్తి వస్తువులు ధ్వంసమై ప్రాణా లను వారి చేతిలో పెట్టుకొని ప్రాణాలు కాపాడుకున్న సంగతి తెలిసిందే. విషయం తెలుసుకున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్యాం గోపాల్ రావు ఆధ్వర్యం లో ఈరోజు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు జగ న్నాథం వెంకటరామ్ రెడ్డి దేవేందర్ గౌడ్ సతీష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్యామ్ గోపాలరావు జగన్నాథం మాట్లాడుతూ కామారెడ్డి పట్టణానికి ఘోర విపత్తు రావడం బాధాకరమని కట్టుబట్టలతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బ్రతికిన బాధితులకు శనివారం రోజున వారికి దు ప్పట్ల తో పాటు బ్లాంకెట్స్ ఇతర వస్తువులు పంపిణీ చేయడం జరిగిందని వారు తెలిపారు.

## ఎస్ డిఆర్ఎఫ్ బృందంతో పశువులకు దాన మరియు నీటిని అందజేత

**సూర్య రెంజల్**



గత రెండు మూడు రోజుల నుండి కురుస్తున్నటువంటి వర్షాలకు త్రివేణి సంగమ గోదావరి ఉధృతంగా ఉరకలు వేస్తూ ప్రవహిస్తూ ఉంది. రెంజల్ మండలంలోని కందకుర్తి త్రివేణి సంగమ గోదావరి నది ఒడ్డున గల సీతారాం త్యాగి మహారాజ్ ఆశ్రమం లో ఉన్నటువంటి గోవులకు గత రెండు రోజుల నడి ఎటువంటి ఆహారాలు నీరు లేకపోవడంతో అందించేందుకు కలెక్టర్ వికాస్ మహాతో స్పందించి ఎస్డిఆర్ఎఫ్ బృందాల చేత ఉన్నది మధ్యలో ఉన్నటువంటి ఆశ్రమానికి ఎస్ డి ఆర్ ఎఫ్ బృందంతో పాటు గ్రామస్తులను తరలించి వాటికి దానం మరియు నీటిని అందించే వాటి సంరక్షణను పర్యవేక్షించారు. ఈ నిర్వహణలో తహసిల్దార్ శ్రావణ్ కుమార్, ఎస్ఐ చంద్రమోహన్, రెవెన్యూ మరియు పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# గణేష్ నిమజ్జనం నిమిత్తం ఉమ్మెడ బ్రిడ్జిని పర్యవేక్షించిన పోలీస్ కమిషనర్

**- గణేష్ నిమజ్జనం సందర్భంగా సంబంధిత పోలీస్ సిబ్బందికి సహకరించగలరు**

**సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి**

నిజామాబాదు పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య IPSనందిపేట్ లోని ఉమ్మెడ బ్రిడ్జ్ వద్ద ఏర్పాటు చేసిన గణేశ్ నిమజ్జన స్థలాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా అక్కడి భద్రతా ఏర్పాట్లు,ట్రాఫిక్ నియంత్రణ,ప్రజల రాకపోకలు, నిమజ్జన కోసం ఏర్పాటు చేసిన క్రేన్లు,లైటింగ్, వైద్య సదుపాయాలను పరిశీలించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ నందిపేట్ సబ్-ఇన్స్పెక్టర్‌కు పలు సూచనలు తెలియజేయడం



జరిగింది. నిమజ్జన కార్యక్రమాన్ని శాంతియుతంగా, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అదేవిధంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీసు సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. డీజే లను అనుమతించకూడదని తెలిపినారు. ప్రజలు కూడా పోలీసు విభాగానికి సహకరించి, గణేశ్ నిమజ్జనాన్ని విజయవంతంగా నిర్వహిం చేందుకు సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

# ఏరియల్ సర్వే కాదు క్షేత్రస్థాయిలో సీఎం పర్యటించాలి

**- మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ -భారీ వర్షాలతో నష్టపోయిన రైతులను ఎకరాకు లక్ష రూపాయలు అందించాలి**

**- మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్**

**సూర్య ఎల్లారెడ్డి**

సీఎం రేవంత్ రెడ్డి ఏరియల్ సర్వే చేయడం కాదని.. క్షేత్రస్థాయిలో పర్యటిస్తే రైతుల బాధలు, వరద తాకిడికి కొట్టుకుపోయిన రైతుల పొలాల్లో పెట్టుకున్న కన్నీటి చుక్కల విలువ తెలుస్తుందని ఎల్లారెడ్డి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో భారీ వర్షాల కారణంగా తీవ్రస్థాయిలో పంట నష్టం జరిగిందని, నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. శనివారం ఎల్లారెడ్డి మండలంలో పర్యటించి భారీ వరదల కారణంగా దెబ్బతిన పంటలను, రహదారులను పరిశీలించారు. ఈ





సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జాజల సురేందర్ మాట్లాడుతూ వరద ప్రభావిత ప్రాంతాల్లో సీఎం రేవంత్ రెడ్డి నేరుగా పర్యటించకుండా హెలికాప్టర్ ద్వారా ఏరియాల్ సర్వే చేస్తే రైతుల కష్టాలు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు.. భారీ వర్షాలు కురిసి నాలుగు రోజులు గడిచిన ఇప్పటివరకు ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి రాలేదని, సంబంధిత అధికారులు సైతం పత్తా లేరని మండిపడ్డారు. నియోజకవర్గంలోని అనేక చెరువులు తెగిపోయాయని, పోచారం ప్రాజెక్టులకు సైతం గండి పడిన పరిస్థితి నెలకొందని అన్నారు. ఈ వరదల కారణంగా రైతులు అపారంగ నష్టపోయారని, వారి పంట పొలాల్లో ఇసుక దిబ్బలు, రాళ్లు రప్పలు వచ్చి పడటంతో అపార నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి లక్ష రూపాయల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఇళ్ళు కూలిపోయిన వారికి తక్షణమే ఆర్థికసాయం చెయ్యాలన్నారు. పదిరోజుల్లో ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం చెల్లించకపోతే రైతాంగంతో కలిసి ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పట్టణ అధ్యక్షులు జలంధర్ రెడ్డి , ఆదిమూలం సతీష్ గుప్తా, సొసైటీ చైర్మన్ ఏగుల నర్సింలు, పటేల్ సాయిలు , నాగిరెడ్డిపేట్ మాజీ జడ్పిటిసి మనోహర్ రెడ్డి , ఆయా గ్రామాల సర్పంచులు కొండాపూర్ సర్పంచ్ సత్యం, యూత్ నాయకులు అట్కారి బబ్లు, నాగం సురేందర్,జంగిటి నారాయణ, తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# భారీ వర్షాలకు డ్రైనేజీలు జామ్ జెసిబి సహాయంతో చెత్తను తొలగించాం

**- వార్డ్ ఇంచార్జి చిన్నోళ్ల రజినీకాంత్**

**సూర్య కామారెడ్డి టౌన్**



కామారెడ్డి పట్టణంలో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో కామ్ కామారెడ్డి పట్టణం మొత్తం అతలాకుతలం కావడంతో ఎక్కడి డ్రైనేజీలు అక్కడ భారీ చెత్తతో కూరుకపోవడంతో కాలనీవాసులకు తీవ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి దీంతో దోమల బెడద కూడా అధికమ వడంతో స్థానిక బిజెపి నేతలకు కాలనీవాసులు ఫిర్యాదు చేయడంతో 12వ వార్డు బిజెపి ఇంచార్జ్ చిన్నోళ్ల రజినీకాంత్ ఆధ్వర్యంలో డ్రైనేజీ లో పేరుకు పోయిన చెత్తను జెసిబిసాయ ంతో 12th వార్డు కల్వర్టు లలో , డ్రైనేజీ లో చెత్త కూరుకుపోవడం తో పాటు వర్షపు నీరు నిలిచింది. మళ్ళీ వచ్చే వర్షాల నేపద్యంలో దీనిపై స్పందించిన 12th వార్డు బీజేపీ ఇంచార్జీ చిన్నోళ్ల రజినీ కాంత్ ఆధ్వర్యంలో తన స్వంత ఖర్చుల తో JCB సాయంతో కూరుకు పోయిన చెత్త ను తొలిగి ంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు పెద్దోళ్ల గోపాల్, చిన్నోళ్ల రాము, గోవర్ధన్, కె. రజినీకాంత్ ప్రభాకర్ మరియు బీజేపీ కార్యకర్తలు సహాయ కార్యక్రమం లో పాల్గొన్నారు.

## చౌదరి చెరువును పరిశీలించిన తహసీల్దార్,ఎంపీడీవో

**సూర్య, లింగంపేట్**



లింగంపేట్ మండలంలోని పోల్కంపేట్ గ్రామాన్ని వరదకు గురైన పంట పొలాలను,చౌదరి చెరువును తహసీల్దార్ సురేష్,ఎంపీడీవో నరేష్ లు పరిశీలించారు.శనివారం పోల్కంపేట్ గ్రామాన్ని వారు సందర్శించి చౌదరి చెరువులో జరుగుతున్న పునరుద్ధరణ కార్యక్రమాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడి పంట నష్టం, ఇండ్లు కూలిపోయిన వారి వివరాలు క్షేత్రస్థాయిలో వెళ్లి అడిగి తెలుసుకున్నారు.వీరి వెంట పంచాయతీ కార్యదర్శి అశ్వక్,స్థానిక కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

# లింగంపల్లి ఖుర్దు బ్రిడ్జిని 12 ఫీట్ల వెడల్పు

**- మూడు కోట్లతో నిర్మించాలి**

**-పోల్కంపేట్ చౌదరి చెరువు కట్ట మరమ్మత్తులు చేయాలి**
**-రైతులకు పంట నష్టం ఎకరానికి 20 వేల చొప్పున చెల్లించాలి**
**-సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్**

**సూర్య,లింగంపేట్**



లింగంపేట్ మండలంలోని లింగంపల్లి ఖుర్దు బ్రిడ్జిని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి సిపిఎం పార్టీ బృందం శనివారం పరిశీలించారు. ఈ సందర్భం గా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ లింగంపల్లి ఖుర్ధు పాత బ్రిడ్జి ఐదు ఫీట్ల వెడల్పుతోని 100 సంవత్సరాల క్రితం నిర్మిం చిందిని అని ఇప్పుడు తాతకాలికంగా పనులు నడుస్తున్న ప్పటికీ తెలంగాణ ప్రభుత్వం వెంటనే మూడు కోట్ల రూపాయలతో 12 ఫీట్ల వెడల్పుతో కొత్త బ్రిడ్జిని నిర్మించాలని డిమాండ్ చేశారు.ఇది ఇట్లానే కొనసాగిస్తే భవిష్యత్తు తరాలకు ప్రజలకు ఇబ్బంది అవుతుందని ఆయన అన్నారు. అనంతరం పోల్కంపేట గ్రామాన్ని సందర్శించి తెగిపోయిన చౌదరి చెరువు,చిన్న చెరువులను, పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడి పంట నష్టం వివరాలు తెలుసుకున్నారు. స్థానిక ఎమ్మార్వో ఎంపీడీవో లను నష్టాన్ని అంచనా వేయాలని అధికారు లను కోరడంతో స్పందించిన ఎమ్మార్వో సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకట్ గౌడ్,కొత్త నరసింహులు, నాయకులు మోహన్,గ్రామస్తులు పాల్గొన్నారు.

# యుద్ధ ప్రాతిపదికన బ్రిడ్జి పనులు చేపట్టాలి

**-ఆర్,అండ్,బి అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్**

**సూర్య,లింగంపేట్**



అకాల వర్షాలతో కూలిపోయిన బ్రిడ్జి పనులను ప్రజలకు ఇబ్బంది కాలకుండా యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆర్,అండ్,బి అధికారు లకు ఆదేశించారు.ఆయన శనివా రం లింగం పేట్ మండలంలోని లింగంపల్లి ఖుర్ధు ప్రాంతంలోని కేకేవై రోడ్డు పైన ఉన్న కూలిన బ్రిడ్జిని ఆర్,అండ్,బి అధికారుల ఆధ్వర్యం లో జరుగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ బ్రిడ్జి కూలిపో వడంతో కామారెడ్డి ఎల్లారెడ్డి రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయని పనుల్లో వేగం పెంచాలని అధికారులకు సూచించారు.ఎల్లారెడ్డి డివిజన్లో దెబ్బతిన్న అన్ని రోడ్లు,బ్రిడ్జి పనులను పునరుద్ధరణ పనులు వేగంగా జరిగే లా పర్యవేక్షించాలన్నారు. ఇండ్లు నష్టపోయిన పంటల వివరాలు త్వరగా సేకరించేలా పర్యవేక్షించాలని ఎల్లారెడ్డి ఆర్డిఓ పార్థసింహారెడ్డికి ఆదేశించా రు.వీరి వెంట స్థానిక మండల కాంగ్రెస్ నాయకులు, ఆర్,అండ్,బి అధికా రులు,స్థానిక ఎంపీడీవో నరేష్,తహసీల్దార్ సురేష్, వివిధ శాఖల అధికా రులు,గ్రామస్తులు ఉన్నారు.

## వరద బాధితులకు తక్షణ సాయం కింద నగదు అందజేత జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

**సూర్య కామారెడ్డి టౌన్**



వరద బాధితులకు తక్షణ సాయం గా కామారెడ్డి పట్టణంలోని జి.ఆర్ కాలనీలో వరద ముంపు కు గురైన 48 ఇండ్లకు ఒక్కొక్క ఇంటికి 11,500 రూపాయల ఆర్థిక సాయం ను జిల్లా కలెక్టర్ఆశీష్ సాంగ్వాన్ గారు ప్రకటించారు. హౌసింగ్ బోర్డ్ కాలనీలో సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జి ఆర్ కాలనీలో ఉంటున్న పేద మధ్యతరగతి సర్వం కోల్పోయిన బాధితులకు వెంటనే పునరావాసం కొరకు ఈ నగదును అందజేస్తున్నామని తాత్కాలిక ఉపశమనాన్ని పొందాలని ఈ విపత్తు నుండి కోలుకోవాలని ఆయన ఆశించారు ఈ కార్యక్రమంలో ఆర్డీవో వీణ ఎంఆర్ఓ జనార్ధన్ ఆర్ ఐ నరసింహారెడ్డి ఇతర సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మూడో రోజు రైళ్ల పునరుద్ధరణ

**- రెండు రోజులుగా నిలిపి వేసిన రైళ్లు**
**- దేవగిరి కాచిగూడ రైళ్ల ప్రారంభం**

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**



కామారెడ్డిలో కుంభ వృష్టి వర్షాలకు తలమడ్ల లో తెగిన రైలు పట్టాలకు రెండు రోజులుగా బంద్ ఉన్న రైళ్లను అత్యధిక కార్మికులతో శనివారం నాడు రాత్రింబవళ్లు శ్రమించి పునరుద్ధరిం చారు. రైల్వే శాఖ అత్యధిక కార్మికులతో ఆరు జెసిబి లతో రెండు రోజులు శ్రమించి తలమడ్ల తిప్పాపూర్ మధ్య దెబ్బతిన్న రైలు పట్టాలను పునరుద్ధరించి రిపేరు చేశారు. శనివారం నాడు దేవగిరి ఎక్స్ప్రెస్,కాచిగూడ, నిజామాబాద్ రైళ్లను పునరుద్ధరించారు. గత రెండు రోజులుగా నిలిపివేసిన రైళ్లను దారి మళ్లించిన రైళ్లు కామారెడ్డి నిజామా బాద్ కామారెడ్డి సికింద్రాబాద్ మార్గంలో తిరిగి ప్రారంభం కావడంతో రైల్వే ప్రయాణికులు రైలు ప్రయాణాలను కొనసాగిస్తున్నారు. దీంతో అధికారులు ఊపిరిపిల్చుకున్నారు.

## భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్ల పనుల పురోగతిని పరిశీలించిన జిల్లా కలెక్టర్

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**



కామారెడ్డి జిల్లాలో భారీ వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్న రోడ్లను శనివారం రోజున జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ జిల్లా అధికారులతో కలెక్టరెట్ లో సమావేశం నిర్వహించి జిల్లాలో వర్షం అనంతరం చేపట్టిన వివిధ పునరుద్దరణ పనుల పురోగతి పై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరుసగా కురిచిన భారీ వర్షాల వలన జిల్లా వ్యాప్తంగా దెబ్బతిన్న రహదారులు, విధ్యుత్, ఇరిగేషన్ ప్రాజెక్ట్ లు తదితర వసతుల పునరుద్దరణ కోసం తాత్కాలిక చేపట్టిన పనులను వేగవంతం చేసి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని అన్నారు. అదేవిధంగా పర్మనెంట్ పనుల కోసం పూర్తిస్థాయి ప్రతిపాదనలు రేపటి లోగా అందించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ చందర్ నాయక్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.